నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
సోమవారం, తెలంగాణ
02 మార్చి 2026

## ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు



**రాజేంద్రనగర్,మార్చి1 (నినాదం ):** అత్తాపూర్ గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఘనంగా 'జాతీయ విజ్ఞాన దినోత్సవం' విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా అత్తాపూర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం విద్యార్థుల సృజనాత్మక ఆలోచనలతో, వైజ్ఞానిక ప్రదర్శనలతో సందడిగా మారింది.



శాస్త్రీయ ఆవిష్కరణలు: విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి తయారు చేసిన వివిధ రకాల శాస్త్రీయ నమూనాలు, వర్కింగ్ మోడల్స్ ప్రయోగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. నిత్యజీవితంలో విజ్ఞానశాస్త్రం ప్రాధాన్యతను చాటిచెప్పేలా ప్రాజెక్టులను ప్రదర్శించారు. నాయకత్వం పర్యవేక్షణ: పాఠశాల ప్రధానాచార్యులు జి. కృష్ణారావు మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. విద్యార్థులను ప్రోత్సహించడంలో ఇన్‌చార్జ్‌లు కళ్యాణి, అఖిల, రాజిత గార్లు కీలక పాత్ర పోషించి, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానాచార్యులు మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, పరిశోధనాత్మక ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ, వారు చూపిన కృషిని ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే కాకుండా, వారిలో శాస్త్రీయ స్ఫూర్తిని నింపిందని నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



**మల్కాజిగిరి, మార్చి 1(నినాదం):** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ ఇందిరా నెహ్రూ నగర్ లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 44 ఏళ్ల తర్వాత నేస్తాల కలయిక..

### ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

### హాజరైన జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు



**కోదాడ,మార్చి1(నినాదం):** నాలుగు దశాబ్దాల క్రితం విడిపోయిన పూర్వ విద్యార్థులు మళ్ళీ కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆత్మీయ ఆలింగనాలతో మురిసిపోయారు. 1981- 82 కోదాడ జడ్పీ గర్ల్స్ హైస్కూల్లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కోదాడ పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బాలమ్మ ల అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో పాత రోజులను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు సందడిగా గడిపారు. చదువుకున్న నాటి అల్లరి, స్నేహం ఇప్పటికీ తమ మనసుల్లో పదిలంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు.నేటి యాంత్రిక జీవనంలో పాత స్నేహితులను కలుసుకోవడం మనసుకి ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుందన్నారు. స్నేహితుల మధ్య ఉన్న ఈ అనుబంధం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు..

## ఎస్టీ హాస్టల్ విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

**కోదాడ,మార్చి 1(నినాదం):** అనంతగిరి మండల కేంద్రంలోని ఎస్టి హాస్టల్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, నోట్ పుస్తకాలు గ్రామ సర్పంచ్ నకరికంటి వీరభద్రమ్మ పంపిణీ చేశారు.అనంతరం హాస్టల్‌ను తనిఖీ చేసి పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించారు. విద్యార్థులకు అందించే భోజన నాణ్యతను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువులో రాణించాలని ఆమె ఆకాంక్షించారు.



## త్రిపురవరం గ్రామానికి ప్రత్యేక గుర్తింపు చిహ్నం..

**కోదాడ,మార్చి 1(నినాదం):** ప్రతి దేశానికి, ప్రతి రాష్ట్రానికి తమ ప్రత్యేకతను తెలియజేసే గుర్తింపు చిహ్నం ఉన్నట్లే, ఇప్పుడు అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామానికి సొంత చిహ్నం రూపుదిద్దుకుంది. గ్రామ ప్రముఖులు, యువత మరియు మేధావుల సూచనలతో రూపొందించిన ఈ గుర్తింపు చిహ్నంలో గ్రామానికి ప్రత్యేకమైన అంశాలను ప్రతిబింబించే చిత్రాలు, సంకేతాలు చోటుచేసుకున్నాయి. వ్యవసాయం, విద్య, ఐక్యత వంటి విలువలను చాటిచెప్పేలా చిహ్నం రూపకల్పన చేయడం విశేషం.గ్రామ చిహ్నం ఆవిష్కరణ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, త్రిపురవరం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నదని, ఈ చిహ్నం గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. గ్రామానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. గ్రామస్తులు కూడా ఈ చిహ్నాన్ని ఆహ్వానిస్తూ హర్షం వ్యక్తం చేశారు. త్రిపురవరం పేరు మరింత ప్రతిష్ఠత సాధించాలని ఆకాంక్షించారు.




# అల్ఫోర్స్ స్కూల్లో ఘనంగా సారంగ్ వార్షికోత్సవం

- విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచిన సాంస్కృతిక వేడుకలు, ప్రముఖుల సందేశాలు




**కరీంనగర్, మర్చి 1(నినాదం):** వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ ప్రాంగణంలో సారంగ్ పేరుతో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం ముఖ్య అతిథిగా హాజరై సరస్వతి దేవి విగ్రహానికి పూలమాల అర్పించి, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, 24వ డివిజన్ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, విద్యార్థులకు సమగ్ర ప్రోత్సాహం అందించి, చదువుతో పాటు పలు రంగాల్లో నైపుణ్యం సాధించేలా వనరులు కల్పిస్తే వారు సమాజంలో అగ్రగాములవుతారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, తల్లిదండ్రుల సూచనలు అనుసరించడం ద్వారా ఉన్నత స్థానాలు సాధించవచ్చని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు కోసం అమలు చేస్తున్న పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో అమలవుతున్న విద్యా విధానాలు స్ఫూర్తిదాయకమని, విద్యార్థుల ప్రతిభా వికాసానికి దోహదపడుతున్నాయని అతిథులు ప్రశంసించారు. కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి విద్యార్థులు బాధ్యతాయుతంగా కృషి చేసి సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకుని మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, నియంత్రణతో ఉన్నత ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా బోధన అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వార్షిక ప్రణాళికలో నిర్వహించిన ప్రతిభా పోటీల్లో మరియు పాఠశాల స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బానీస సంకేళ్ళు ఇంకెన్నాళ్ళు?





- అగ్ర వర్గాలకు బుద్ధి చెప్పాలండోయ్ !
- సమ సమాజం,నవ సమాజా స్ఫూర్తికోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యమాలతో జన జాగృతికి కృషి చేయండి...
- డాక్టరేట్ విశారదన్ మహారాజ్ వెల్లడి...

**ఆర్మూర్, మార్చి 1-( నినాదం):** బీసి,ఎస్సీ,ఎస్టీ, జేఏసి ఆధ్వర్యంలో సామాజిక న్యాయం, రాజ్యాధికారం కై ముఖ్య కార్యకర్తల సమావేశం ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల లో జరిగిన సమావేశంలో ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు, బి సి, ఎస్సీ, ఎస్,టి, జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా ఆర్మూర్ మండల కేంద్ర పరిధిలోనున్న మైత్రి ఫంక్షన్ హాల్ నందు ముఖ్య కార్యకర్తల సమావేశంలో భాగంగా బి.సి. ఎస్సి,ఎస్టి, జేఏసీ ఆధ్వర్యంలో,బడుగు, బలహీన వర్గాల, వెనుకబడిన తరగతులనుద్దేశించి, డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ, ఆంధ్రుల నుండి కొట్లాడి తెచ్చుకున్నా వీర తెలంగాణలో,ఇకనైనా మన బడుగు బలహీన వర్గాలు, అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో, ముందుకు దూసుకెళ్ళేందుకు, బీసీ రిజర్వేషన్ల పట్ల ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు, బీసీలను చైతన్యం చేస్తూ, బిసి రాజ్యాంగ అధికారం చేపట్టే విధంగా ప్రతి ఒకరు కృషి చేయాలన్నారు. అమర వీరుల కళలు కన్నా బలిదానాలు, నిరుపయోగంగా మారి యాధావిధిగా అప్పుడు ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం ఉన్నప్పటి కి, మతాల చిచ్చు, అగ్రవర్ణాల రెడ్డి,రావ్, దొర అనే కుల దురహంకారం, బడుగు బలహీణ వర్గాలపై ఇంకా చెలరేగుతుందని, అందుకొరకే తెలంగాణ రాష్ట్ర బడుగు బలహీణ వర్గాలు అగ్ర కులాలకన్నా సుమారు 80% శాతం ఉన్నా కూడా .అగ్ర కుల అధికార నాయకుల చేతుల్లో బలిఅవడం ఇకా ఎన్నాళ్ళు అని ఆయన ప్రశ్నించారు.? ఉదాహరణకు మొన్న జరిగిన ఉదాతం నాగర్ కర్నోల్ జిల్లా కుమ్మెర గ్రామ వృత్తాంతం అందరికి తెలిసిందే. అందుకొరకే బడుగు బలహీణ వర్గాలు ప్రతీ ఒక్కరు రాజా కీయంగా ఎదిగితే విద్యా,వైద్యం టెక్నికల్ రంగాలలో, అభివృద్ధి పదంలో ముందుకు దూసుకేళ్ళేందుకు అందరం చేయి చేయి కలిపి నడుంబిగించాలని అన్నారు, అందుకే మన బడుగు బలహీణ వర్గాలలో చారిత్మక మార్పు తేవాలని, నేను కాదు హీరోను ప్రతీ పీడీత యువత ప్రశ్నిస్తే .ప్రతీ గ్రామంలో అగ్ర కులాల నాయకులు, అడుగంటి పోతారని, అన్నారు. ఇకనైనా ఇప్పటికైనా అన్నదమ్ములు,అక్కచెల్లెళ్ళు, అగ్ర కులాల మొచేతి నీళ్ళు ఎప్పుడైతే త్రాగకుండా మానుకుంటారో, అప్పుడే మన బీసీ,ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీణ వర్గాలు అభివృద్ధిలో రాజాకీయంగా, ప్రశ్నించే గొంతుగా ముందుకు సాగుతే,ముందుతరం బిడ్డలకు, యువతకు, ఉద్యోగ, వైద్యం, విద్య, అన్ని రంగాలలో బీసీ ఎస్సీ ఎస్టీ, ఎస్సీ మైనార్టీలకు అన్ని హక్కులు దక్కించుకునేలా వారిలో స్ఫూర్తినివ్వాలని, కార్యకర్తలను చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు, బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

# మొగుదాల స్వామి దశదిన కర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**మునుగోడు, మార్చ్ 1 (నినాదం):** మునుగోడు నియోజకవర్గ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మోగుదాల రమేష్ గౌడ్ తండ్రి. చౌటుప్పల్ పురపాలక చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ మామా మొగుదాల స్వామి పది రోజుల క్రితం మరణించడం జరిగింది. ఆదివారం వలిగొండ రోడ్డు లోని ఎస్ఎం రెడ్డి ఫంక్షన్ హాల్ లో ఘనంగా దశదిన కార్యక్రమం నిర్వహించారు. అట్టి కార్యక్రమానికి, మునుగోడు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని. మొగుదాల స్వామి చిత్రపటానికి పూలమాలవేసి, నివాళు లర్పించారు. అలాగే వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**మునుగోడు,మార్చ్ 1 (నినాదం) :** మునుగోడు మండలం. కిష్టాపురం గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలై మానసికంగా కృంగి గుండెపోటు తో మృతిచెందిన చెన్నగోని కాటంరాజు కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, ఒక లక్ష రూపాయలు) ఆర్థిక సహాయం గా ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాటంరాజు మరణించడం చాలా బాధాకరమని, వారు లేని లోటు తీర్చలేనిదని. భవిష్యత్తులో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో, మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సురిగి నరసింహ గౌడ్, వార్డ్ సభ్యులు. మహేశ్వరం భరత్ కుమార్, నిరుడు శేఖర్ ముదిరాజ్, మైసూర్ కందుల రవికుమార్, పాలుట్ల ప్రేమ్ కుమార్, ఈరటి చెన్నయ్య యాదవ్, నూతన కంటి లింగస్వామి, శ్రీను, నందిపాటి లక్ష్మయ్య, పాలెం వెంకటేష్, ఉమ్మెత్తలా శివప్రసాద్, ఉమ్మెత్తలా సాయికిరణ్, అరురీ మాసయ్య, జాజుల సాయికుమార్, మహేశ్వరం నవీన్, సురిగి బబ్లు, జాజుల ప్రభాకర్, సురిగి మల్చూర్, జాజుల చిన్న లింగస్వామి, సురిగి లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.



# అనుమానాస్పదంగా బాలిక మృతి

**మిర్యాలగూడ మార్చి 1( నినాదం):** మైనర్ బాలిక అనుమానాధస్పదంగా మృతి చెందిన సంఘటన ఆదివారం మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ శివారులోని రమణయ్య ఇటిక బట్టీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీవన ఉపాధి కోసం ఒరిస్సా బొంగు ముండ గ్రామం నుండి మిర్యాలగూడ నియోజకవర్గంలోని గూడూరు గ్రామంలో ఇటుక బట్టీలో పని చేయడానికి కుటుంబ సభ్యులైన దీనబంధు చూర,ప్రేమ చీలచురా ల కూతురు అయ్యిన మనిషా చర (16)తో ఇటుక బట్టీలు పనిచేస్తున్నారు.తల్లిదండ్రులకు సహాయంగా ఉంటూ ఇంటి పనులు చూసుకునేదని ఉదయం తల్లిదండ్రులు ఎప్పటిలాగే పనికి వెళ్లారు.మధ్యాహ్నం వచ్చేసరికి తన కూతురు ఉలుకు పలుకు లేకుండా పడి ఉందని, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చేసరికి మృతి చెందినట్లు తెలిపారు. నా కూతురికి బాలుకాయి మండల్ పాట్నాగండి కి చెందిన తబిరంతో పెళ్లి కుదిరినట్లు తెలిపారు. తబిరాం కూడా వారితో పాటే ఇటుక పట్టిలో పనిచేస్తున్నాడని ఈ సంఘటన జరిగినప్పటి నుండి తబిరం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## రష్మిక విజయ్ దేవరకొండ ఆధ్వర్యంలో అన్నదానం



**చింతపల్లి, మార్చి1( నినాదం):** ఇటీవల వివాహ బంధముతో ఒక్కటైన ప్రముఖ సినీనటులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారి వివాహం సందర్భంగా దేశ ప్రజల ఆశీర్వాదం పొందడానికి దేశంలోని అన్ని ఆలయాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారి సిబ్బంది ఎదుదొడ్ల వినీల్ రెడ్డి, ముత్యపు వంశీ, దాట్ల వర్మ, జెతిన్ లు తెలిపారు. నూతన దంపతులు నిండు నూరేళ్ళు సంతోషంగా ఉండాలని ఆశీర్వదిస్తూ, వారిని ఆలయ నిర్వాహకులు బాబా చిత్రపటంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు తడకమళ్ల శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే బాలునాయక్‌ను ఆహ్వానించిన జితేందర్ రెడ్డి



**చింతపల్లి ,మార్చి 1 (నినాదం):** మండలంలోని తీదేడు గ్రామంలో కొలువుతీరిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ను ఆ గ్రామ మాజీ సర్పంచ్, మండల కాంగ్రెస్ నాయకుడు కాయితి జితేందర్ రెడ్డి తో పాటు గ్రామ పురోహితులు సురభి సత్యనారాయణ శర్మ, సురభి కృష్ణమూర్తిశర్మ, సురభి ప్రభాకర్ శర్మ,మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్ లు ఆదివారం ఆవాల పత్రికను అందజేశారు. ఈనెల 10వ తేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని వారు కోరారు.

## అనారోగ్యంతో సీనియర్ విలేకరి మృతి

### నివాళులర్పించిన విలేకరులు, నాయకులు



**భీమదేవరపల్లి, మార్చి 1 (నినాదం):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో అనారోగ్యంతో సీనియర్ విలేకరి ఎర్రబెల్లి వెంకట రమణారెడ్డి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మండలంలోని చంటయ్యపల్లి గ్రామానికి చెందిన రమణారెడ్డి 25 సంవత్సరాలుగా విలేకరిగా పనిచేస్తూ తనదైన ముద్ర వేసుకున్నారు. గత కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం హైదరాబాదులోని ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, సహచర విలేకరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. నిజాయితీతో వార్తా రంగంలో సేవలందించిన రమణారెడ్డి మృతి మీడియా రంగానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు ఆకాంక్షించారు.

# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 2 మార్చి 2026


## నందిగామలో విషాద ఛాయలు

**-బీఆర్ఎస్ నాయకుల కుటుంబాలకు పరామర్శ**

**-నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**



**నల్లబెల్లి, మార్చి 1 (నినాదం):**
వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నందిగామ గ్రామంలో చోటుచేసుకున్న రెండు విషాద ఘటనలు గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేశాయి. ఈ నేపథ్యంలో (బీఆర్ఎస్) నాయకుల కుటుంబాలను పరామర్శించేందుకు నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి గ్రామాన్ని సందర్శించారు.సంధ్యారాణి మరణంపై సంతాపం,నందిగామ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు గూగులోతు రఘు కుమార్తె సంధ్యారాణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. దేవుడి చిత్తమే అన్న భావనతో మనోధైర్యం కోల్పోకూడదని వారికి ధైర్యం చెప్పారు. పోరిక బాలునాయక్‌కు చివరి వీడ్కోలు,అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పోరిక బాలునాయక్ మరణం పట్ల కూడా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీకి, గ్రామాభివృద్ధికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇస్తూ ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మాజీ పీఏసీఎస్ చైర్మన్, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఉప సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.గ్రామస్థులు మాట్లాడుతూ, ఇలాంటి సందర్భాల్లో నాయకులు కుటుంబాలకు అండగా నిలవడం ధైర్యాన్నిస్తుందని పేర్కొన్నారు.

## మాజీ సర్పంచ్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు, సన్మానాలు



**ఆర్మూర్, మార్చి 1(నినాదం):** ఆర్మూర్ మాజీ సర్పంచ్ రామచంద్ర హోలిడే దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నాయకులు పి. వినయ్ కుమార్ రెడ్డి దంపతులతో పాటు, ఆర్మూర్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కౌన్సిలర్ శాల ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు జమ్మి రవి, కొంతశీమురళి, హనుమాన్ ఆలయ కమిటీ డైరెక్టర్ దుండి రమణ, పలువురు కాంగ్రెస్ నాయకులు ఆర్మూర్ మాజీ సర్పంచ్ రామచంద్ర హోలిడే హో0డే 45వ పెళ్లిరోజును పురస్కరించుకొని ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.


## విజ్ఞాన విహార యాత్రలో పత్తిపాక విద్యార్థులు




**ధర్మారం మార్చి 1 (నినాదం):**
మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాల విద్యార్థులుఈ రోజు కరీంనగర్ లోని పలు సందర్శనీయ స్థలాలకు విజ్ఞాన విహార యాత్రకు తరలి వెళ్లారు. ముందుగా ఎలగందుల ఖిల్లా కోటను సందర్శించి దాని ఆవశ్యకతను అలాగే జిల్లాలోని చారిత్రక ప్రదేశా లు మరియు సందర్శనీయ స్థలాల గురించి విద్యార్థిని విద్యార్థులకు చూపించి వాటి ప్రస్థానాన్ని అవశ్యకతను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బోధించారు. రైల్వే స్టేషన్ సందర్శించిన భారతీయ రైల్వే పనితీరు విధానాన్ని స్టేషన్ తో రాకపోకల వివరాలను అలాగే లోయర్ డ్యాంలో బోటింగ్ చేసి ఉజ్వల పార్క్ డిర్ పార్కులను సందర్శించి వివిధ రకాల పక్షులను చూస్తూ విద్యార్థులు ఆనందోత్సాహాలతో సందడి చేశారని ప్రధానోపాధ్యాయుడు మల్లన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మూతి మల్లన్న ఉపాధ్యాయులు గుండ్రాతి శ్రీలత అనుమల శారద సిరిపురం సునీల్ చెక్కపల్లి అరుణశ్రీ కత్తి రజిత క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ఎదుర్ల ప్రేమ్ సాగర్ లక్ష్మి మాల ఆశ వర్కర్లు ఎదురుగా జల, సరిత తల్లిదండ్రులు ఎదుల అనిల్ రమ్య మొదంపల్లి అంజలి కాంపల్లి రజిత సుజాత అంజలి హసీనా శ్రావణ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఊళ్లో కోతులను పట్టించిన సర్పంచ్

**-కోతుల బెడద నుంచి ప్రజలకు ఉపశమనం**



**భీమదేవరపల్లి, మార్చి 1 (నినాదం):**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్ర గ్రామమైన భీమదేవరపల్లిలో కోతులు అధికంగా సంచరిస్తూ ప్రజలపై దాడులు చేయడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటలు, ఇళ్లలోకి చొరబడి వస్తువులు ధ్వంసం చేయడం, పిల్లలువృద్ధులపై దాడి చేసే పరిస్థితి ఏర్పడటంతో గ్రామంలో భయభ్రాంతులు నెలకొన్నాయి.ఈ సమస్యపై ప్రజల నుంచి వచ్చిన సూచనల మేరకు గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి ఆదివారం రోజున ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోతులను పట్టించి అడవి ప్రాంతాల్లో వదిలిపెట్టేలా ఏర్పాట్లు చేశారు.ఇతర ప్రాంతాల నుంచి పట్టుకొచ్చిన కోతులను గతంలో బూడిద గుట్టల్లో వదిలిపెట్టడం వల్ల గ్రామంలో కోతుల సంఖ్య పెరిగిందని సర్పంచ్ తెలిపారు. ఇకపై అలా చేయకుండా, కోతులను నేరుగా అడవి ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.ఈ చర్యలతో గ్రామ ప్రజలు ఊరట చెందగా, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కోతుల బెడద శాశ్వతంగా తొలగిపోవాలంటే అధికారులు కూడా సహకరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# సమాజ చైతన్యానికి సాహిత్యం దోహదం

**-ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు**

**వైభవంగా 'అక్షరాలతోవ' 8వ వార్షికోత్సవ వేడుకలు**

**కథ, కవిత, వక్తృత్వ పోటీల విజేతలకు పురస్కారాల ప్రదానం**




ఖమ్మం ప్రతినిధి మార్చి 1 :(నినాదం )
సమాజ చైతన్యానికి సాహిత్యం దోహదం చేస్తుందని ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు పేర్కొన్నారు. 'అక్షరాలతోవ' సాహితీ సంస్థ ఎనిమిదవ వార్షికోత్సవం ఖమ్మం లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం 'అక్షరాలతోవ' నిర్వాహకులు నామా పురుషోత్తం అధ్యక్షతన జరిగింది. తొలుత కథలు, కవితలతో ప్రచురించిన పుస్తకాన్ని, జూలూరుపాడు మండలం పాపకొల్లు ఉన్నత పాఠశాల విద్యార్థి గార్లపాటి కృష్ణ మనోహర్ రచించిన 'ప్రకృతి సాయం' కథల పుస్తకాన్ని మువ్వా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. ఎనిమిది ఏండ్లుగా అక్షరాలతోవ సాహితీసేవ చేయడం అభినందనీయమన్నారు. ఏటేటా పోటీలు నిర్వహిస్తూ కవులను, రచయితలను ప్రోత్సహిస్తున్న అక్షరాలతోవను అభినందిస్తున్నా నన్నారు. విద్యార్థులలో సాహితీ బీజాలు నాటడం, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడం, బాల సాహిత్యం పట్ల అక్షరాలతోవ నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్‌కున్న నిబద్ధతకు నిదర్శనమన్నారు. పోటీలు నిర్వహించడమే కాదు, విజేతలైన కవుల, రచయితల రచనలను ఏటేటా పుస్తకంగా వెలువరించడం గొప్ప విషయంగా భావిస్తున్నా న్నారు. సమాజ వికాసానికి అక్షరాలతోవ చేస్తున్న సాహితీ సేవకు సాహితీవేత్తలందరూ ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం ప్రముఖ రచయిత్రి వురిమళ్ల సునంద మాట్లాడుతూ... కవిత్రయం చేస్తున్న సాహితీ సేవను అభినంస్తున్నానని, వారికి ప్రోత్సాహంగా తానెప్పుడూ ఉంటానని పేర్కొన్నారు. పరిశ సీతారత్నం ట్రస్టు వ్యవస్థాపకులు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ.. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సాహితీ సేవ చేస్తున్న నిర్వాహ కులను అభినందిస్తున్నానన్నారు. మునుముందు కూడా వారికి తన ప్రోత్సాహం ఉంటుందన్నారు. ప్రముఖ కథా రచయిత మంత్రి ప్రగడ శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్షరాలతోవ ద్వారా ఎంతోమంది కవులు గుర్తింపు పొందారని, వారిలో తానొకరినని పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రి తాళ్లూరి లక్ష్మి, బాల సాహితీవేత్త సయ్యద్ షఫీ, పొత్తూరి సీతారామారావు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ ప్రసంగించారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన కథల పోటీల విజేతలైన ఎనుగంటి వేణుగోపాల్, పొత్తూరు సీతారామరాజు, డాక్టర్ జడ సుబ్బారావు, మంత్రిప్రగడ శ్రీనివాసరావు లకు అక్షరాలతోవ నగదు పురస్కారాన్ని అందించా రు. ఆదివారం అక్షరాభిషేకం పేరుతో వారం వారం నిర్వహించిన కవితా పోటీల విజేతలను ఘనంగా సన్మానించారు. వార్షికోత్సవం సందర్భంగా.. పలు పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మెమొంటో, సర్టిఫికెట్ అందజేసి సన్మానించారు. జిల్లాలో కళా రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న కళాకారులు, గాయకులు మూసా, పాగి వెంకన్న, మొగిలి గుణకర్, కెవి చారి, నాగసాయి, మోదుగు గోవింద్, సదానందం, స్వప్నలకు మెమోంటో అందజేసి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్షరాలతోవ నిర్వాహకులు దాసరోజు శ్రీనివాస్, రాచమల్ల ఉపేందర్, ప్రముఖ కవులు దిలావర్, పోతగాని సత్యనారాయ ణ, కన్నెగంటి వెంకటయ్య, గద్దపా టి శ్రీనివాస్, ఐనాల సైదులు, ధరణికోట రమేష్, ఎం.వి రమణ, దేవయ్య, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కోండ్రు బ్రహ్మం, రేళ్ళ శ్రీనివాస్, పెద్దోజు నరేష్, ఇబ్రహీం నిర్గుణ్, పలువురు జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న వయసులోనే సేవా కార్యక్రమాలు




**చేవెళ్ల మార్చి (నినాదం ):-**
చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెన వార్డుకు చెందిన క్రిష్ణ మోహన్ ముదిరాజ్ చిన్న వయసు నుంచే పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ వారు ప్రతిష్టాత్మక 'జాతీయ సేవా రత్న' అవార్డుకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు ఎంపిక పత్రాన్ని హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో క్రిష్ణ మోహన్ ముదిరాజ్ అందుకున్నారు.ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ, సమాజంలో వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, వారి సేవలను గుర్తించి అవార్డులతో ప్రోత్సహించడం అకాడమీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇలాంటి గుర్తింపులు మరింత యువతను సమాజ సేవ వైపు ప్రేరేపిస్తాయని అన్నారు.కాగా, మార్చి 15న తిరుపతిలో నిర్వహించనున్న అల్ ఇండియా బహుజన రైటర్స్ కాన్ఫరెన్స్ లో అందించనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో క్రిష్ణ మోహన్ ముదిరాజ్‌కు 'జాతీయ సేవా రత్న' అవార్డును ఘనంగా ప్రదానం చేయనున్నట్లు నల్లా రాధాకృష్ణ వెల్లడించారు. సామాజిక సేవ చేయాలనే సంకల్పంతో సేవలు అందిస్తున్న వారిని బహుజన సాహిత్య అకాడమీ గుర్తిస్తూ ప్రతీ ఏటా ప్రత్యేక అవార్డుల కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ 22 దేశాల్లో కూడా బహుజన సాహిత్య అకాడమీ విస్తరించిందని ఇది హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు.అవార్డు ఎంపిక పత్రాన్ని అందుకునే కార్యక్రమంలో చేవెళ్ళ మున్సిపల్ 8 వార్డు కౌన్సిలర్ దావలగారి గోపాల్ రెడ్డి అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర గోపాల్ లు వేదికపై జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ తో పాటుగా వేదిక పై పాల్గొన్నారు. క్రిష్ణ మోహన్ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని కౌన్సిలర్ గోపాల్ రెడ్డి కొనియాడారు.

## యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలి

**-గ్రేహౌండ్స్ ఎస్పీ వెంకటేశ్వర్లు**



**చేవెళ్ల మార్చి 01 (నినాదం):**-యువత స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని గ్రేహౌండ్స్ ఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. చేవెళ్లలో యువకులు మల్లేష్ యాదవ్, రమేష్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీరామ కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ స్టోర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో యువత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్ వంటి సహజ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదిస్తే వ్యాపారంలో విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాజపా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అతెల్లి అనంతరెడ్డి, చన్ వెల్లి సర్పంచి ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శివానంద తదితరులు పాల్గొన్నారు.

## కృతజ్ఞత సభకు తరలివెల్లిన ఉద్యమకారులు



**మల్హర్, మార్చి 01 (నినాదం):**
తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించి 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లు ఇస్తామని ఆరు గ్యారంటీల్లో పొందుపరచి వాటి అమలుకు ప్రత్యేక సబ్ కమిటీని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ప్రకటన చేయడం పట్ల (టియూఎఫ్) తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మానిఫెస్టో కమిటీ చైర్మన్ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్ లకు కృతజ్ఞతగా కరీంనగర్ ఫిలీం భవన్ లో ఆదివారం నిర్వహించిన కృతజ్ఞత సభకు మండల ఉద్యమ కారులు తరలి వెళ్తు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించి మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ వేసి ఉద్యమంలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని కోరారు. హామీ ఇచ్చి అమలుకు సిద్ధ పడుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రకటన చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,వివేక్ వెంకటస్వామి, టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టియూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలోజు సత్యనారాయణ, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు యాదండ్ల గట్టయ్య యాదవ్, ప్రదాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్, అధికార ప్రతినిధి బోయిని రాజయ్య యాదవ్, మల్హర్ రావు మండల అధ్యక్షులు బూడిద సతీష్, అవిర్నేని పురుషోత్తం రావు, చొప్పరి రాజు, షేక్ చాంద్ పాష, ఆకుల సదానందం, దేవి భూమయ్య, కోండ్ర సారయ్య, జునగరి పద్మ. యాదండ్ల చిన్న గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమ అమరులకు ఘన నివాళులు



**భీమదేవరపల్లి, మార్చి 1 (నినాదం):**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరులైన మాదిగ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ఉద్యమం విజయవంతం కావడంలో అమరవీరుల త్యాగాలు మరువలేనివని, వారి పోరాటాలే నేటి విజయాలకు బాటలు వేశాయని తెలిపారు. సమాజ న్యాయం కోసం వారు చూపిన ధైర్యం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్ల వెంకటస్వామి, సీనియర్ నాయకులు రేణిగుంట్ల బిక్షపతి, ఎంఎల్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మధుకర్, భీమదేవరపల్లి మండల కన్వీనర్ పార్నందుల సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలుగూరి రాజు, మాడుగుల అశోక్, అంబాల చక్రపాణి, ఎల్తూరి ప్రేమ్‌రాజ్, తూముల స్వామి, బుగ్గ సుధీర్, తాడూరి చిరంజీవి, మాడుగుల శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర కమిటీ సభ్యునిగా తిరుపతి ఎంపిక

**-భీమదేవరపల్లి నుంచి జాతీయ స్థాయికి ప్రాతినిధ్యం**



**భీమదేవరపల్లి మార్చి 1 (నినాదం):**
మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) కేంద్ర కమిటీ సభ్యునిగా భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మాదం తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 23, 24 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రంలోని జోద్‌పూర్లో నిర్వహించిన జాతీయ స్థాయి ఐక్యత సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా మాదం తిరుపతి మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజల కోసం, ముఖ్యంగా కార్మికులురైతుల హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విలువలను కాపాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లాభాలు పొందేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి కుల, మత, ప్రాంతాల పేరుతో ప్రజలను విడదీయడం సరికాదని స్పష్టం చేశారు.అలాగే రాష్ట్రంలోని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి, ప్రజా హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగుతుందని మాదం తిరుపతి స్పష్టం చేశారు.

## జర్నలిస్టు మల్లయ్యను పరామర్శించిన తుమాటి



**కోదాడ, మార్చి 1 (నినాదం):**
కోదాడ రూరల్ కు చెందిన జర్నలిస్టు నాయిని మల్లయ్య అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమాటి వరప్రసాద్ రెడ్డి ఆదివారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గుడిబండ సర్పంచ్ మందుల నాగయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎస్.కే. రఫీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఈర్ల నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ జయసింహ రెడ్డి, సోమపంగు శ్రీనివాసరావు, రాజారావు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని ఆర్థిక సహాయం అందించారు.

## నాగారం అన్ని కాలనీల అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం



**కీసర మార్చ్ 01, (నినాదం):**
కీసర సర్కిల్, నాగారం, రాంపల్లి ప్రాంతాల అన్ని కాలనీ అధ్యక్షులు, కార్యదర్శుల అత్యవసర, ప్రాధాన్యమైన సమావేశం శివశంకర్ నగర్లో నిర్వహించబడింది. ఈ సమావేశ ప్రారంభంలో అన్ని కాలనీ ప్రతినిధులకు పరిచయం చేయబడింది. అనంతరం సిహెచ్ దేవి వరప్రసాద్ రావు ఆధ్వర్యంలో వివిధ కాలనీలను ప్రభావితం చేస్తున్న అత్యవసర, దీర్ఘకాలంగా పూర్తికాని సమస్యలపై విస్తృతంగా చర్చించబడింది. చైర్‌పర్సన్ వేణుగోపాల్ ప్రసంగిస్తూ, ప్రస్తుతం ఉన్న సమస్యలను ఇకపై వాయిదా వేయలేమని, నిర్లక్ష్యం చేయలేమని తెలిపారు.

సోమవారం। తెలంగాణ
2 మార్చి 2026

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

# రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

## స్కూలు భూమి పూజలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి





**మునుగోడు, మార్చి 1 (నినాదం):** మునుగోడులోని దుబ్బ కాలువ రోడ్డులో రూ.200 కోట్ల పాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, టీ జీ ఈ డబ్ల్యు ఐ డి సి ఎండి గణపతి రెడ్డితో కలిసి భూమిపూజ చేసారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. అనంతరం అందరితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో 200 కోట్లతో 2500 మంది విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం చేసుకోవడం శుభ పరిణామం అని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి నా మునుగోడు ప్రజల తరపున ధన్యావాదాలు తెలియజేస్తున్నాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో 79 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి.వీటిలో సుమారు రెండు లక్షల మందివిద్యార్థులు,చదువుకోబోతు న్నారని తెలిపారు.మేము చిన్ననాటి చదువుకునేటప్పుడు కులాల గురించి తెలియదు.అన్ని కులాల అన్ని మతాలవారు ఒకే ప్రాంగణంలో చదువుకునేవాళ్లం ఇప్పుడు ఇవి కూడా అలాంటి పాఠశాలే..ఈ పాఠశాలలో అన్ని కులాల వారు అన్ని మతాలవారు కలిసిమెలిసి చదువుకోవచ్చు అని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం విద్యను గాలికి వదిలేసింది.కొందరికి బర్లిచ్చారు, కొందరికి గొర్లిచ్చారు, కొందరికి చేప పిల్లలు ఇచ్చారు..కానీ నాణ్యమైన విద్యను అందించలేదు. విద్య వైద్యాన్ని గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని ముక్తకంఠంతో తెలిపారు.

### కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ

దేశంలో ఏ రాష్ట్రంలో చేయలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ పథకాన్ని తీసుకొచ్చిందని తెలి పారు.ఈ స్కూళ్లు పూర్తయిన తర్వాత దేశంలోని ప్రతి రాష్ట్రం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. రాబోయే రెండు సంవత్సరాలలో ఈ స్కూలు నిర్మాణం పూర్తి అవుతుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసింది అవి సీమాంధ్ర కాంట్రాక్టర్లకు లాభమయ్యాయని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రంలో 76 లక్షల ముప్పై ఐదువేల 115 మంది విద్యార్థిని విద్యా ర్థులు తెలంగాణ రాష్ట్రంలో చదువుతున్నారు.ప్రైవేట్ సెక్టార్ లో 44 లక్షల మంది విద్యార్థులు చదివితే ప్రభుత్వ సెక్టార్లో 24 లక్షల మంది చదువుతున్నారు. విద్య మొత్తం కార్పోరేట్ చేతిలోకి వెళ్ళిపోయింది.కనీసం 50 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ ఇన్స్టిట్యూషన్స్లో చదివే అవకాశం రావాలని కోరారు. బడ్జెట్లో 10 నుండి 15% బడ్జెట్ కేటాయిస్తే సాధ్యమవు తుంది. బడ్జెట్లో విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.మునుగోడు నియోజకవర్గంలో 330 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.. వీటిలో చదివే విద్యార్థుల సంఖ్య 9, 700 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. మునుగోడులో విద్యావ్యవస్థలో సమూల మైన మార్పులు తీసుకురావాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మెస్ చార్జీలను పెంచాం. విద్య విషయంలో రాబోయే రోజుల్లో చాలా చేయాల్సి ఉంది. హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉన్న మునుగోడు నియోజక వర్గంలో అభివృద్ధి లేదు. నల్గొండ జిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతం మునుగోడు నియోజకవర్గం.ఈ నియోజకవర్గానికి, ఎంతో చేయాల్సి ఉందని తెలిపారు.మొట్ట మొదటి అడుగు ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ మేనని అన్నారు.నల్గొండ జిల్లా అంటే రాష్ట్ర రాజకీయాల్లో టైగర్ జోన్ అని,నల్లగొండ జిల్లా రాష్ట్ర రాజకీయాలను శాసించే జిల్లా అని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, ఇంటిగ్రేటెడ్ స్కూలు ప్రారంభ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కి శుభాభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం రాజ్ గోపాల్ రెడ్డి తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యను అందించే ప్రయత్నం జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని తెలిపారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో విద్యకు తక్కువ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని ఆయన అన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర వసతులు ఉన్నాయని తెలిపారు.విద్యా వైద్యంపై ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని సూచించారు.విద్యా వైద్యాన్ని కార్పొరేట్ శక్తులు వ్యాపారంగా మార్చారని, ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కల్పించి ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల కొరత ఉన్నదని, నియోజకవర్గ కేంద్రంలో, ఇంటిగ్రేటెడ్ పాఠశాల రావడం శుభ పరిణామమని ఎమ్మెల్సీ అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన

# రష్మిక మందన్న..

## రిసెప్షన్‌కి ఆహ్వానం..



టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల వివాహం రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో కుటుంబ సభ్యులు, కొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో జరిగింది. ఈ జంట తమ సొంత గ్రామంలో రిసెప్షన్ వేడుకలు గ్రాండ్‌గా జరుపుకోవడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన రష్మిక సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు రష్మిక. ఈ నెల 4వ తేదీన తుమ్మన్‌పేట ఫామ్‌హౌస్‌లో రిసెప్షన్, సత్యనారాయణ స్వామి వ్రత వేడుకలకు రావాలని ముఖ్యమంత్రి దంపతులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సతీమణి రష్మిక మందన్నకు తెలంగాణ సంప్రదాయం ప్రకారం బొట్టు పెట్టి, కానుక ఇచ్చారు. ముఖ్యమంత్రి దంపతులు రష్మికను దీవించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి 'సినీ నటుడు విజయ్ దేవరకొండతో ఇటీవల వివాహబంధంలోకి అడుగుపెట్టిన సినీ నటి రష్మిక తమ వివాహ రిసెప్షన్‌కు ఆహ్వానించారు' అంటూ 'ఎక్స్' వేదికగా రాసుకొచ్చారు. ముఖ్యమంత్రి దంపతులను సగౌరవంగా ఆహ్వానించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ నెల 4న జరగబోయే రిసెప్షన్ వేడుకలకు సెలబ్రెటీలు, రాజకీయ నేతలకు ప్రత్యేక ఆహ్వానం అందినట్లు సమాచారం.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**కోహెడ, మార్చి 01 (నినాదం) :** మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పండుగగా మారింది.ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర కీలకం ఆట పాటలు, చిలిపి పనులు కష్టం, సుఖం ఇలా ఏదైనా కాని మన వెన్నంటే ఉండి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పేదే ఒక స్నేహం. ఆనందం, బాల్యం, స్మృతులు, కరచాలనాలు, చెమ్మగిల్లిన కళ్ళతో అలింగనాలు గురువుల మందలింపులు తలుచుకుంటూ ఒకసారి వయస్సు మరచి పోయి చిన్న పిల్లల కేరింతలతో తాడువాయి పాఠశాల అవరణం కోలాహలంగా మారింది. ఈ ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సమ్మేళనంలో తమ గురువుల బోధనలు తమ కుటుంబ పరిస్థితులు నాటి చిలిపి చేష్టలను క్రమశిక్షణ పేరుతో గురువుల దండనలు తలుచు కుంటూ సాగిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆడిన ఆటలు పాటలు అలరించాయి. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానం చేశారు.వచ్చిన పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో పొద్దు పోయే వరకు గడిపి బరువెక్కిన హృదయాలతో ఎవరి గమ్య స్థానాలకు వారు కదిలారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం







ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హామీ
కళాశాలకు ప్రహరీ గోడ నిర్మాణం, ల్యాబ్ ఏర్పాటు చేస్తా: పైళ్ల మల్లారెడ్డి...
క్రీడలకు ప్రతి సంవత్సరం ఐదు లక్షల చొప్పున ఏర్పాటుకు హామీ: పైళ్ల మల్లారెడ్డి...
పాటల సిడిని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కుంభం, మల్లారెడ్డి

**వలిగొండ, మార్చి 1 (నినాదం) :** మండలకేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2004 నుండి 2026 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ప్రవాస భారతీయిలు కళాశాల నిర్మాణ దాత డాక్టర్ పైళ్ల మల్లారెడ్డి, స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతా వ్యక్తి మల్లారెడ్డి ఈ గ్రామంలో విద్యను అభ్యసిఁచి ఈ ప్రాంతా పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని అన్ని దానాలకన్నా విద్యా దానం గొప్పది అని, పుట్టిన ఊరు మమకారంతో ఈ కళాశాల భవనం, పాఠశాల భవనం స్వంత ఖర్చులతో నిర్మించారని, గ్రామంలో శ్రీ వెంకటేశ్వర ఆలయ సముదాయం నిర్మించారని అన్నారు. వాటి అన్నిటితో ఈ ప్రాంతానికే వన్నె తెచ్చిన వ్యక్తి మల్లారెడ్డి అని కొనియాడారు. విద్యార్థుల కోరిక మేరకు కళాశాల వద్ద ఆర్టిసి రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. పైళ్ల మల్లారెడ్డి మాట్లాడుతూ నేను చిన్న నాడు ఈ ప్రాంతంలోనే చదువుకున్నానని అప్పుడు వసతులు లేక చాలా ఇబ్బంది ఎదురుకున్నానని విద్యార్థుల సమస్యలు దృష్టిలో పెట్టుకొని జూనియర్ కళాశాల భవనం 2.2 కోట్లతో నిర్మించానని అన్నారు. అప్పటి ప్రభుత్వం 5 సంవత్సరాల కళాశాలకు ఖర్చులు భరించాలని కోరడంతో ఒప్పుకొని నిర్మాణ పనులు చేపట్టానని అన్నారు. ఇప్పటివరకు భవనం మారమ్మతులు కూడా నేనే భరిస్తున్నాని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని కళాశాలకు మంచి పేరు తేవాలని కోరారు. పాఠశాల అధ్యాపకులు, విద్యార్థుల కోరిక మేరకు కళాశాల ప్రాహరి గోడ నిర్మాణం, కళాశాలలో ల్యాబ్ సౌకర్యం, ప్రతి సంవత్సరం కళాశాలలో క్రీడాలకు 5 లక్షల చొప్పున ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థిని శ్రీజ బృందం కూచిపూడి నృత్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ప్రముఖ గాయకుడు మిట్టపెల్లి సురేందర్, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ కుమార్, నాయకుకు నూతి రమేష్, బత్తిని లింగయ్య, కళాశాల పూర్వ అధ్యాపకులు, అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గుట్ట మైసమ్మ బోనాలు!..

## హాజరైన ఛైర్మెన్ తూమొల్ల దత్తాత్రి







**నిర్మల్ ప్రతినిధి,( భైంసా ): మార్చ్ 01( నినాదం):** ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే పట్టణ నేతాజీ నగర్ పాండ్రి మైసమ్మ బోనాల పండుగ ఈ సంవత్సరం కూడా కన్నుల పండుగగా జరిగింది.పట్టణంలోని పలు కాలనీల వాసులు హాజరై బోనాలను ఊరేగింపుగా తీసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి ,వార్డ్ కౌన్సిలర్ నిమ్మల ప్రవీణ్



పలువురు పుర ప్రముఖులు బోనమెత్తి అమ్మవారికి హారతి అందించారు. పాడిపంటలతో రైతులు, తాలూకా, పట్టణ ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండేలా అమ్మవారి అనుగ్రహం ఉండాలని కోరారు. బోనాల పండుగలో పట్టణ నాయకులు, ప్రజలు, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నేతాజీ నగర్ లో ఉన్నటువంటి పలు సమస్యలను చైర్మన్ కి తెలుపగా... విడతల వారీగా అభివృద్ధి పనులను చేపడతానని ఛైర్మెన్ ప్రజలకి హామీ ఇచ్చారు.

## అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మా రెడ్డి



**మిర్యాలగూడ మార్చి 1( నినాదం):** అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మాడ్గులపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన భారత రాజ్యాంగ నిర్మాత డా,, బి ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ మహోత్సవంలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సమాజానికి సామాజిక న్యాయం జరగాలి అని వారు రచించిన రాజ్యాంగం సాక్షిగా తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేస్తూ వారి స్ఫూర్తి తో పరిపాలన కొనసాగిస్తుంది అని అన్నారు.ఒక శాసనసభ్యుడిగా అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ అంబేద్కర్ ఆశయ సాధనలో పనిచేస్తానని అని అన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు...

## శంషాబాద్ ఎయిర్ పోర్టులో పలు విమానాల రద్దు గల్ఫ్ ప్రయాణికుల అవస్థలు



హైదరాబాద్, : ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా విమానయాన సంస్థలు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా విమాన మార్గాలను మార్చడం లేదా రద్దు చేస్తున్నాయి. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ప్రధానంగా గల్ఫ్, అరబ్ దేశాలకు వెళ్లే సర్వీసులపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. శంషాబాద్ నుంచి వివిధ దేశాలకు వెళ్లాల్సిన 23 విమాన సర్వీసులు రద్దయ్యాయి. అదేవిధంగా వివిధ దేశాల నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన 21 విమాన సర్వీసులు కూడా నిలిచిపోయాయి. దుబాయ్, దోహా (ఖతార్), కువైట్, దమ్మమ్, సౌదీ అరేబియా, షార్జా, అబుదాబి, జెడ్డా, మస్కట్ దేశాలకు వెళ్లాల్సిన 23 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

# ఎస్సీ వర్గీకరణ సాధనకు అమరుల త్యాగాలే బాట

## ఎమ్మార్పీఎస్ నేతల స్పష్టం



**నల్లబెల్లి, మార్చి 1 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో ఆదివారం మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు పరికి రత్నం మాదిగ నాయకత్వం వహించారు.ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉద్యమంలో జాతి హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన దండోరా ముద్దుబిడ్డలను స్మరించుకుంటూఅమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు రెండు నిమిషాల మౌనం పాటించి అమరుల త్యాగాలను స్మరించారు.మూడు దశాబ్దాల పోరాట పథం,ఎస్సీ వర్గీకరణ సాధన కోసం సాగిన ఉద్యమం రాష్ట్ర రాజకీయ, సామాజిక రంగాలలో కీలక చర్చకు దారితీసిందని నాయకులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం సాధించాలనే సంకల్పంతో ప్రారంభమైన ఈ ఉద్యమం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, అమరవీరుల త్యాగాలు పోరాటానికి దిక్సూచి అయ్యాయని అన్నారు.ఈ సందర్భంగా పరికి రత్నం మాదిగ మాట్లాడుతూ, జాతి హక్కుల కోసం మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలుగా సాగుతున్న పోరాటంలో భాగస్వామ్యం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. అమరవీరులు కలలు కన్న ఎస్సీ వర్గీకరణ ఆశయం నెరవేరే దిశగా నేడు జాతి ఫలితాలను పొందుతోంది. వారి త్యాగాలను ఎప్పటికీ మర్చిపోలేం. వారి పోరాట స్ఫూర్తిని రాబోయే తరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత,అని అన్నారు.సామాజిక న్యాయం దిశగా కీలక అడుగుఎస్సీ వర్గీకరణ కోసం సాగిన ఉద్యమం వెనుకబడిన వర్గాలకు న్యాయం చేకూర్చే మార్గాన్ని సుగమం చేసిందని, సమాన అవకాశాలు అందించాలనే లక్ష్యంతో ఉద్యమం కొనసాగిందని నాయకులు వివరించారు. అమరవీరుల త్యాగాల ఫలితంగా నేడు జాతి అనుభవిస్తున్న పురోగతి మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు పరికి కొర్నేల్ మాదిగ, మాజీ ఎంపీటీసీ జన్ను జయరావు మాదిగ, మండల నాయకులు కనుకం నవీన్ మాదిగ, పొడేటి కిషోర్ మాదిగ, గూడెపు భాస్కర్ మాదిగ, కనకం శ్రీకాంత్ మాదిగ, పొడేటి పవన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. బీసీ నాయకులు బత్తిని మల్లయ్య, సామల దేవేందర్, తంగెళ్ల వేణు, పున్నం ప్రశాంత్ తదితరులు హాజరై అమరవీరులకు నివాళులు అర్పించారు.సంస్మరణ కార్యక్రమం చివరలో జాతి ఐక్యతకు పిలుపునిస్తూ, అమరవీరుల ఆశయ సాధన కోసం మరింత కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.